ప్రజాశక్తి
బుధవారం 23 అక్టోబర్ 2024

అనంతపురం ఉప్పనేసినపల్లి వద్ద పేదల వేసుకున్న గుడిసెల వద్దకు చేరిన నీరు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. రాత్రి 12 గంటలకు ప్రారంభం అయిన వర్షం ఉదయం 6గంటల వరకు పడింది. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, రాప్తాడు, పెనుకొండ, కొత్తచెరువు మండలాల్లో భారీ వర్షపాతం నమోదు అయ్యింది. అనంతపురం శివారు ప్రాంతంలో ఉన్న పండమేరు వంక పొంగిపొర్లింది. దీంతో శివారు కాలనీలు నీటమునిగాయి. పండమేరు వంక పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు అన్నీ జలమయం అయ్యాయి. రాత్రి 3 గంటల సమయంలో ఒక్కసారిగా మోకాళ్లలోతు వరద నీరు రావడంతో కాలనీవాసులు కట్టుబట్టలతో అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. కొందరు ప్రాణభయంతో మిద్దెలపైకి ఎక్కారు. ఇళ్లలోకి నీరు చేరి సామగ్రి మొత్తం తడిసిపోయింది. పలు ద్విచక్ర వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. మిద్దెలపై ఉన్న వారిని సురక్షితంగా కిందకు దించి పునరావాస కేంద్రాలకు తరలించారు.పలు మండలాల్లో పంటలు నీటమునిగాయి.

అనంతపురం శివారులోని ఉప్పనేసిన పల్లి వద్ద నీటమునిగిన జగనన్న కాలనీ

పుట్టపర్తి వద్ద ప్రవహిస్తున్న చిత్రావతి నది

ముంచెత్తిన వాన

- పొంగిపొర్లిన పండమేరు
- నీటమునిగిన అనంత శివారు కాలనీలు
- నీటి ప్రవాహంతో నిలిచిన రాకపోకలు
- కనగానపల్లి, బండమీదపల్లి చెరువులకు గండి
- పలు పంటలు నీటమునక
- ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల పరిశీలన

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో మగ్గం గుంతల్లోకి చేరిన వర్షం నీరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం క్రైం, పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాను వర్షం ముంచెత్తింది. సత్యసాయి, అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి అధిక వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఒక్కసారిగా పడిన అధిక వర్షాలకు కొన్ని చోట్ల చెరువులకు గండ్లుపడగా, మరికొన్ని చోట్ల రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సత్యసాయి జిల్లాలో సరాసరి వర్షపాతం 1902.2 మిల్లీమీటర్లు నమోదవగా, సగటు వర్షపాతం 59.4 మిల్లీమీటర్లు నమోదయింది. అనంతపురం జిల్లాలో సరాసరి వర్షపాతం 802.4 మిల్లీమీటర్లు పడగా, సగటు వర్షపాతం 25.4 మిల్లీమీటర్లు నమోదయింది. ఇందులో సత్యసాయి జిల్లాలో కనగానపల్లి మండలంలో అత్యధికంగా 198.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. దిగువకు నీరు వెళ్లడంతో ధర్మవరం చెరువు నిండింది. దిగువన తనకల్లు మండలంలోని చెన్నరాయస్వామి గుడి (సిజి) ప్రాజెక్టు నిండింది.

రాప్తాడు మండలం బండమీదపల్లిలో చెరువు తెగి నీటిలో పడి మృతి చెందిన గొర్రెలు

పలుచోట్ల చెరువులకు గండ్లు

అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని బండమీదపల్లి గ్రామ చెరువుకు గండిపడింది. దీంతో చెరువు కిందనున్న పంటలు దెబ్బతిన్నాయి. బోయ లావణ్యకు చెందిన 80 గొర్రెలు, మేకలు నీటమునిగిచనిపోయాయి. రామిరెడ్డికి చెందిన చీనితోట దెబ్బతింది. ఈ నీరంతా దిగువనున్న పండమేరు వంకలోకి చేరడంతో పండమేరు వంక ఉధృతంగా ప్రవహించింది. నగర శివార్లలో పండమేరుకు ఆనుకుని ఉన్న రామకృష్ణ కాలనీతోపాటు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టరు శివనారాయణలు వెంటనే స్పందించి చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆ ప్రాంతాల్లోనున్న వారికి సహాయక చర్యలు చేపడుతున్నారు. పెనుకొండ వద్ద హంద్రీనీవా కాలువకు గండిపడటంతో నీరు పందిపర్తి, మంచేపల్లి చెరువుల్లోకిఉధృథంగా చేరుతోంది. విషయం తెలుసుకున్న బిసి సంక్షేమ శాఖ మంత్రి గండిపూడ్చి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని హంద్రీనీవా ఇంజినీర్లకు ఆదేశాలిచ్చారు. వరద ఉధృతిలో గుట్టూరు వద్ద జాతీయ రహదారి 44పైకి నీరు రావడంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. ధర్మవరం-అనంతపురం మధ్య గుట్టూరు వద్ద చెరువు మరవపారి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇక్కడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 20 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పుట్టపర్తి నియోజకవర్గంలోనూ పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నీట మునిగిన జగనన్న లేఅవుట్

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి సర్వే నెంబర్ 194లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లోని ఇళ్లు మొత్తం సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నీటమునిగాయి. వేకువజామున 3గంటల సమయంలో మోకాళ్లలోతుకు పైగా వరదనీరు రావడంతో ఒక్కసారిగా కాలనీవాసులు భయాందోళనతో మిద్దెలపైకి ఎక్కారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వరద నీటిలో చిక్కుకున్న వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షంతో కట్టుబట్టలతో ఇంటి నుంచి బయటకు వచ్చేశామంటూ కాలనీవాసులు అధికారులు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీరు రావడంతో ఇళ్లలో ఉన్న నిత్యావసర సరుకులు, సామగ్రి పూర్తిగా నాశనం అయ్యిందన్నారు.

నీటమునిగినిన పంటలు

సత్యసాయి జిల్లాలో ఎనిమిది మండలాల్లో 17 గ్రామాల్లో వర్షం వల్ల నష్టం సంభవించిందని అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. 1146 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. 32.87 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ధర్మవరం డివిజన్‌లో 27 ఇళ్లు దెబ్బతినగా, కదిరి డివిజన్‌లో 14, పెనుకొండ డివిజన్‌లో ఐదు ఇళ్లు దెబ్బతిన్నాయి. అత్యధికంగా వర్షపాతం నమోదయిన కనగానపల్లిలో 18 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లాలో 315 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్టు అంచాన వేశారు. ఇందులో అత్యధికంగా వరి పంట 235 హెక్టార్లలో నష్టం సంభవించింది. 27 గ్రామాల పరిధిలో ఈ నష్టం జరిగినట్టు లెక్కించారు. ఉద్యానవన పంట నష్టం అంచనాలు ఇంకా రావాల్సి ఉంది.

శ్రీసత్యసాయి జిల్లాలో రికార్డు వర్షం

పుట్టపర్తి రూరల్ : శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు అయ్యింది. కనగానపల్లి మండలంలో 198.2 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షం కురిసింది. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో సైతం భారీ వర్షం పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేరోజు రికార్డు స్థాయిలో జిల్లా వ్యాప్తంగా సరాసరి 1902.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. సగటు వర్షపాతం 59.4 మిల్లీమీటర్లు. ఇదే నెలలో వారం క్రితం ఒకేరోజు 1700 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం జిల్లాలో నమోదు అయ్యింది. దీనికి మించి సోమవారం రాత్రి ఏకంగా 1902.2 సరాసరి వర్షపాతం, సగటు వర్షపాతం 59.4 మిల్లీమీటర్ల కురవడం విశేషం. కుంభవష్టి కారణంగా జిల్లాలోని అనేక చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండి మరువ పారాయి. జిల్లాలోనే పెద్ద చెరువుగా ప్రసిద్ధి చెందిన ధర్మవరం చెరువు మరువపారింది. కదిరి నియోజకవర్గంలోని తనకల్లు మండలంలో ఉన్న చెన్నకేశవ స్వామి గుడి (సీజీ ప్రాజెక్ట్) ప్రాజెక్టు నీటితో నిండుకుండలా కనిపిస్తోంది. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఈ ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి నీటిని కిందకు వదిలారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ముందస్తు హెచ్చరికలు చేశారు. కనగానపల్లి మండలం దాదులూరు పోతలయ్య గుడి వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వాగు ఉధతంగా ప్రవహిస్తోంది. ఈ వాగులో పశువులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. పుట్టపర్తి మండల పరిధిలోని చిత్రావతి వంగ పేరు, నదులు ఉధతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి వంగపేరు ఉధతికి కొట్లపల్లి-నిడిమామిడి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పరిశ్రమల నుంచి విధులు ముగించుకుని వస్తున్న కొట్లపల్లి వాసులు ముగ్గురు నదిలో కొంత దూరం కొట్టుకుపోయారు. స్థానికులు వారిని రక్షించి క్షేమంగా బయటకు తీశారు. పుట్టపర్తి మండల పరిధిలోని వంగ పేరు, చిత్రావతి నదుల ఉధృతికి మండలంలో పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. పెడపల్లి, గంగంపల్లి ప్రధాన రహదారిలో చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో పెడపల్లి నుంచి గంగంపల్లి, గంగిరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి.

భారీ వర్షాలతో నిలిచిన రాకపోకలు

కొత్తచెరువు-ధర్మవరం రహదారిపై ప్రవహిస్తున్న వంగపేరు నది

పలు వాహనాలు దారి మళ్లింపు

కొత్తచెరువు రూరల్: భారీ వర్షంతో కొత్తచెరువు- ధర్మవరం ప్రధాన రహదారిలో రాకపోకలు స్తంభించాయి. కొత్తచెరువు మండల పరిధిలోని సత్య సాయి వాటర్ సప్లై పంపు వద్ద వంగపేరు నది ఉధతికి రాకపోకలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ఆ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. నీటి ఉధృతి తగ్గేంత వరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది నదిని దాటడానికి ఎవరినీ అనుమతించలేదు. కొత్తచెరువు నుంచి పెనుగొండకు వెళ్లే రహదారిలో రైల్వే బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో రహదారిలో రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెనుగొండకు వెళ్లే వాహనాలన్నింటినీ మామిళ్లకుంట క్రాస్, జగరాజుపల్లి మీదుగా పెనుగొండ ప్రదాన రహదారి వైపు మళ్లించారు. పుట్టపర్తి నుంచి అనంతపురానికి వెళ్లి వాహనాలను దారి మళ్లించి జగరాజు పల్లి ,పెనుగొండ మీదుగా అనంతపురానికి పంపారు. మండల పరిధిలోని లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీరామ్ రెడ్డి వరి పంట పూర్తిగా నేల కొరిగింది. వంగపేరు నదీ పరివాహ ప్రాంతాన్ని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, కొత్తచెరువు తహశీల్దార్ నీలకంఠారెడ్డి పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

జలదిగ్బంధంలో దాదులూరు దేవాలయం

జలదిగ్బంధంలో ఉన్న దాదులూరు పోతలయ్య దేవాలయం

శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం దాదులూరు గ్రామంలో ఉన్న పోతలయ్య స్వామి దేవాలయం చుట్టూ నీరు చేరింది. ఒక్కసారిగా పామేరు వంక పొంగిపొర్లడంతో ఆలయం చుట్టూ నీరు చేరింది.

ముంపు ప్రాంతాల్లో పరిటాల సునీత, శ్రీరామ్ పరిశీలన

అనంతపురంలో నీటమునిగిన కాలనీలను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

అనంతపురం రూరల్ పరిధిలోని నీట మునిగిన ఉప్పరపల్లి తదితర కాలనీలను ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ సందర్శించారు. పండమేరు వాగు ఉధతికి నీట మునిగిన రాప్తాడు మండలం ప్రసన్నయపల్లి పంచాయతీ పరిధిలోని కళాకారుల కాలనీ, అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ, సద్గురు గురుదాస్ కాలనీల్లో జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలసి పర్యటించి, సహాయక చర్యలను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. పంట నష్టం, పశు నష్టాన్ని అధికారుల ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాలన్నారు. వర్షం వల్ల ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్న పరిటాల సునీత స్థానికులకు తెలిపారు.

పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

వరద ప్రభావిత ప్రాంతాల్లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిశీలించి, పరిస్థితిని అధికారులతో కలిసి సమీక్షించారు. నారా లోకేష్ కాలనీ, రామకృష్ణ కాలనీ, సుశీలరెడ్డి కాలనీ, తిమ్మానాయుడు కాలనీ, అభ్యుదయ కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల వాసులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, మంచినీటి సౌకర్యం కల్పించారు.

ముంపు ప్రాంతాలకు ఎస్పీ

పండమేరు వంక పరిసర కాలనీలైన కళాకారుల కాలనీ, విన్సెంట్ డీ పాల్ స్కూలు ప్రదేశం, గురుదాస్ కాలనీ, టివి టవర్ శివారు కాలనీ, అనంతపురం-కదిరి జాతీయ రహదారిలోని పండమేరు బ్రిడ్జి, ఆటోనగర్ ప్రాంతాలను ఎస్పీ జగదీష్ మంగళవారం ఉదయం పరిశీలించారు. ఆయా కాలనీల వాసులతో మాట్లాడి వరద నీటి ఉధతి తగ్గేంత వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని వారికి సూచించారు.

బాధిత రైతులను ఆదుకోండి : వి.రాంభూపాల్

బండమీదపల్లిలో తెగిన చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రాప్తాడు : వర్షం వల్ల పంటలు, ఇతర కుటుంబ సామగ్రిని నష్టపోయిన బాధితులు అందరినీ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. రాప్తాడు మండల పరిధిలోని బండమీద పల్లి గ్రామంలో వర్షం దాటికి చెరువ తెగి, దాని కింద ఉన్న పంటలు నీటమునిగాయి. బండమీదపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డితో పాటు పలువురు రైతులకు చెందిన పంటలు నీటిలో మునిగాయి. బాధిత రైతులను సిపిఎం నాయకులు మంగళవారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రామిరెడ్డి అనే రైతు చీనీ సాగు కోసం దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు చేశాడన్నారు. వర్షంతో ఇప్పుడు ఆ రైతు పూర్తిగా నష్టపోయాడన్నారు. ఇతనితో పాటు ఈ చెరువు కింద దాదాపు 70 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులకు పూర్తి స్థాయి పరిహారం ఇవ్వాలని కోరారు. చెరువులు, కుంటలు, కాలువలను అధికారులను పరిశీలించి అవసరం అయిన చోట వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. బండమీద పల్లి గ్రామానికి చెందిన చల్లాపురం పూజారి బోయ మాధవయ్యకు చెందిన 90 గొర్రెలు నీటిప్రవాహంలో మునిగి చనిపోయాని, బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాప్తాడు మండల కార్యదర్శి ఎం.పోతలయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.రామాంజనేయులు పాల్గొన్నారు.

పాముదాయిలో నీటి మునిగిన వరిపంట

పడిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న పాముదాయి వెంకటేష్

వర్షం దెబ్బకు అనంతపురం రూరల్ పరిధిలో పాముదాయి గ్రామంలో వరి పంట దెబ్బతింది. చేతికొచ్చిన పంట నూర్పిడి చేసిన వరి కుప్పలు నీటితో తడిసిపోయాయి. బాధిత రైతులను మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పాముదాయి వెంకటేష్ పరామర్శించారు. సోమలదొడ్డి సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ జైచంద్ర పంట నష్టం వివరాలను సేకరించారు.

తెగిన హంద్రీనీవా కాలువ



హంద్రీనీవా నుంచి బయటకు వెళ్తున నీరు

సోమందేపల్లి : మండల పరిధిలోని మంచేపల్లి సమీపంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో హంద్రీనీవా కాలువ గట్టు తెగిపోయింది. కాలువలో నీరు మంచేపల్లి. పందిపర్తి గ్రామాల చెరువులకు చేరుతున్నాయి. ఇంకా అధికంగా వర్షాలు వస్తే చెరువులు కూడా తెగే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బొమ్మనహాల్‌లో పంట నష్టం

బొమ్మనహాల్ మండలంలో పడిపోయిన వరి పంట

బొమ్మనహాల్ : మండలంలోని వేదవతి నది కనేకల్-బళ్లారి ప్రధాన రహదారిపై మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. నీటి ఉధృతికి వేదవతి నదిపై ఏర్పాటు చేసిన గ్రావెల్ సిమెంట్ పైపులు కొట్టుకుపోయాయి. దీంతో బొమ్మనహాల్, విడపనకల్, కనేకల్, బళ్లారి వైపు వెళ్లే వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షం దెబ్బకు బొమ్మహాల్ మండలంలో పత్తి, మిరప, వరి తదితర పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టం వివరాలను అంచనా వేస్తున్నట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. కళ్ళు దేవనహళ్లి, ఉద్దేహాల్ వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో రాకపోకలను నిలువరించారు. వేదావతి పరివాహన ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

తెగిన వంతెన.. స్తంభించిన రాకపోకలు..!

తెగిపోయిన సున్నంపల్లి వంతెన

ఓబుళదేవర చెరువు: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సోమవతినది ప్రవహించింది. నీటి ఉధృతికి సున్నంపల్లి వంతెన తెగింది. దీంతో సున్నపల్లి పంచాయతీ పరిధిలోని సున్నంపల్లి, మలికవారిపల్లి, పెద్దిగుట్లపల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మంగళవారం సాయంత్రం అధికారులు తెగిన వంతెన ప్రాంతంలో సర్పంచి ధారా లక్ష్మీదేవి, గ్రామస్తుల సహకారంతో రాళ్లు మట్టితో పూడ్చి వేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : మంత్రి

ధర్మవరం రూరల్ : అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. భారీ వర్షాల కారణంగా ధర్మవరం చెరువుతో పాటు గొట్లూరు చెరువు, కనగానపల్లి చెరువులు మరువపారి పొంగిపొర్లుతున్న నేపథ్యంలో సమీప గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకల కింద లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా భారీ వర్షం కురుస్తుండడంతో ఆ జిల్లా నుంచి జిల్లాకు వచ్చే వాగులు, వంకల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతపురం కంట్రోల్ రూం నుంచి అధికారులతో కలిసి ఆయన ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

జాతీయ రహదారిపై వరదనీరు

పెనుకొండ : భారీ వర్షానికి పెనుకొండ మండలం వెంకటగిరిపాలెం చెరువు నిండిపోయింది. చెరువుకట్టపై నుంచి నీరు పెద్ద ఎత్తున ప్రవహించి 44వ జాతీయ రహదారిపై చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుట్టూరు సమీపంలో జాతీయ రహదారిపై మోకాళ్ల లోతుపైగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో పలు వాహనాలు నీటిలో చిక్కుకుని భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. కియా పరిశ్రమ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ సిబ్బందితో నీటిని తోడించి నీటిలో చిక్కుకున్న వాహనాలను జెసిబి సహాయంతో బయటికి తీసుకువచ్చారు. మోటువారి పల్లి చెరువు నిండి మరువ పారుతోంది. మండలంలోని శెట్టిపల్లి వెళ్లే దారిలో రైల్వే అండర్ పాస్‌లో భారీగా నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెనుకొండ పట్టణంలోని లోతట్టు ప్రాంతలైన బ్రాహ్మణ వీధి, కమాన్ వీధి తదితర ప్రాంతాల్లో వర్షం నీటితో నిండిపోయింది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పెనుకొండ డివిజన్‌లో దంచి కొట్టిన వాన

పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోని మండలాల్లో సోమవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. రొద్దం 55.2 మిల్లీమీటర్లు, మడకశిర 58.6, అమరాపురం 44.2, గుడిబండ 24.0, రోళ్ల 21.4, అగళి 48.6, పరిగి 35.6, పెనుకొండ - 89.8, సోమందేపల్లి 70.4, హిందూపురం 83.2, లేపాక్షి 70.2, చిలమత్తూరు 32.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. డివిజన్ మొత్తం 633.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సగటున 52.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

న్యామద్దల చెరువుకు మరువ ఉధృతి

మరువ పారుతున్న న్యామద్దెల చెరువు

చెన్నేకొత్తపల్లి : శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం పరిధిలోని న్యామద్దల గ్రామం చెరువు నీటితో నుంచి మరువ పారింది. మరువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ గ్రామానికి వెళ్లేందుకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మరువ నీరు ఎక్కువగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను మధ్యాహ్నం వరకు ఆపేశారు. గ్రామ పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



టెలికాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకల కింద ఉన్న లోతట్టు ప్రాంతాలలో నివాసముంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నాటకలో కూడా భారీ వర్షం కురుస్తుండడంతో అక్కడి నుంచి మన జిల్లాకు వచ్చే వాగులు, వంకల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం రాత్రి భారీ వర్షం కురిసిందని, మంగళవారం రాత్రి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని చెప్పారు. జిల్లాలో చెరువులు, వాగుల కింద ఉండే లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.

ముందుస్తు చర్యలు తీసుకోవాలి : ఎస్పీ

జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో కురవనున్న వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నిండి ప్రవహించే నీటి ప్రవాహం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.రత్న సూచించారు. రానున్న నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని అందుకోసం అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షాల కారణంగా కియా సమీపంలోని ప్రధాన రహదారి, శెట్టిపల్లి వద్ద, గుడిబండ సమీపంలోని చిగుతూరి చెరువు, కొత్తచెరువు మండలంలోని మర కుంటపల్లి, కొడపగాని పల్లి బ్రిడ్జి, సికేపల్లి మండలంలోని వెల్దుర్తి చిన్నపరెడ్డిపల్లి, బత్తలపల్లి మండలంలోని పోట్లమర్రి, వేల్పుమడుగు, సంగాలపల్లి, కనగానపల్లి మండలంలోని ముక్తాపురం ప్రాంతాలలో రాకపోకలకు అంతరాయం కలిగిందన్నారు. మళ్లీ వర్షాలు ఉన్నందున ప్రజలతో పాటు వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు. అదేవిధంగా కర్నాటక ప్రాంతంలోని పరగోడు నిండి పొర్లుతున్నందున చిలమత్తూరు, లేపాక్షి, గోరంట్ల, పుట్టపర్తి, కొత్తచెరువు, కేసాపురం, కనుముక్కల, చిత్రావతి సమీప ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాతబడిన నివాసాల్లో ఉండే వారిని గుర్తించి అన్ని జాగ్రత్తలు తీసుకొని సురక్షమైన ప్రాంతంలో ఉండే విధంగా చూడాలన్నారు.

సజావుగా మండలమీట్

గోరంట్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. మండలాధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్ర కుమార్. వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయం ఉద్యోగులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొలం బడి

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని కల్లుమర్రి పంచాయతీ లోని ఎలోటి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పంటసాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కల్లుమర్రి సర్పంచి గంగమ్మ, నాగరాజు, వ్యవసాయాధికారి తిమ్మప్ప , ఆర్‌బికె ఇన్‌ఛార్జి విజయ్, నాయకులు నరసన్న, నారాయణప్ప, నర్సీగౌడ్, పెద్ద మూర్తి, మధుసూదన్ గౌడ్, మారుతీ, మూర్తి, సిద్దప్ప, కల్లుమర్రి పంచాయతీ రైతులు పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా

ధర్మవరం రూరల్ : మండలంలో సోమవారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షం వలన రవాణా వ్యవస్థ ఇబ్బందిగా మారిన నేపథ్యంలో బుధవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. ఏరోజుల సమావేశం నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఆయన వివరించారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్),కదిరి.

I.P.No:3/2016

Between:

కాలసముద్రం శ్రీరాములు ...Petitioner

మరియు

Sri.వెంకటేశ్ మరియు ఇతరులు ...Respondants

R1:Sri.వెంకటేశ్ S/o నరసింహులు, Bank Employee, Residing at క్రిస్టియన్ కాలనీ, కదిరి టౌన్ మరియు మండలం.

R12:మరళి Father's name not know, asst, Extension officer, C/o లక్ష్మీనరసింహాస్వామీ దేవస్థానం కదిరి టౌన్ మరియు మండలం.

R17:Sri.సుబ్బారెడ్డి Father's name not know, Residing at R.S.Road, కదిరి టౌన్ మరియు మండలం.

R21:Sri.రాంప్రసాద్ రెడ్డి Father's name not know, Residing at రాజేంద్ర ప్రసాద్ వీధి, కదిరి టౌన్ మరియు మండలం.

R26:Sri.కృష్ణమ్మ Husband's name not know, Residing at కదిరి టౌన్ మరియు మండలం.

R27:Sri.ప్రదీప్ Father' name not know, R/t near Sankar Motors, కదిరి టౌన్

R34:Smt. నారాయణమ్మ Husband's name not know, Employee, in Agricultural Office,Residing at Hindupur Road, కదిరి టౌన్ మరియు మండలం.

R37:Smt. రమణమ్మ Husband's name not know, Employee in Agricultural Office, Residing at కదిరి టౌన్ మరియు మండలం.

R38:Sri.శ్రీనివాసులు @ శీనా Father's name not know, Residing at near లిటిల్ ఫ్లవర్ స్ట్రీట్, కదిరి టౌన్ మరియు మండలం.

R39:Sri. విజయశేఖర్ Father's name not know, Residing at రాజేంద్ర ప్రసాద్ స్ట్రీట్, కదిరి టౌన్ మరియు మండలం.

పై పిటీషన్‌లోని 1,12,17,21,26,27,34,37 to 39, ప్రతివాదులకు నోటీసులు

పై INCOLVENCY PRTITINO ను కాలసముద్రం శ్రీరాములు, పై కోర్టులో Sri.వెంకటేశ్ మరియు ఇతరులు పై దాఖలు చేసి ఉన్నారు. పై INCOLVENCY PRTITINO లో 1వ, 12, 17వ, 21వ, 26వ, 27వ, 34వ, 37వ, to 39వ ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం ఘనమైన కోర్టు వారు 29/10/2024వ తేదిన వాయిదా వేసి యున్నారు. కావున మీరు 29/10/2024వ తేదిన ఉదయం 10:30 గంటలకి స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై అక్షేపనలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై పిటీషన్‌ని మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:29/10/2024

స్థలం : కదిరి

G.గురులింగస్వామి,B.A.,B.L.

పిటీషనర్ తరుపు వకీలు, కదిరి.

త్వరితగతిన గండిపూడ్చివేతకు చర్యలు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

సోమందేపల్లి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కాలువకు పడిన గండిన తక్షణమే పూడ్చాలని రాష్ట్ర బీసీ, సంక్షేమ, చేనేత, జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం కురిసిన భారీ వర్షాలకు సోమందేపల్లి మండలం మంచేపల్లి గ్రామం వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువకు మంగళవారం గండి పడింది. విషయం తెలుసుకున్న మంత్రి హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీరింగ్ అధికారులతో అమరావతి నుంచి ఫోన్లో మాట్లాడారు. తక్షణమే కాలువ గండి పూడ్చి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. పంట నష్టం జరగలేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వరద నీరంతా పందిపర్తి, మంచేపల్లి చెరువుల్లోకి చేరుతోందని వెల్లడించారు. మంచేపల్లి చెరువులో ఇప్పటికే వంద శాతం నీరు చేరిందన్నారు. ఆ చెరువు నిండిన తరవాత పక్కనున్న ఈదుల బళాపురం చెరువులోని వరదనీరు వెళ్లనుందని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ తక్షణమే గండి పూడ్చి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. హంద్రీనీవా నీరు చేరుతున్న చెరువు కట్టలను కూడా బలోపేతం చేయాలని మంత్రి సవిత సూచించారు.

సినీ హీరో నాగార్జునకు విమానాశ్రయంలో ఘనస్వాగతం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సినీ హీరో అక్కినేని నాగార్జునకు పుట్టపర్తి విమానాశ్రయంలో జిల్లా అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఘన స్వాగతం పలికారు. నాగార్జున అనంతపురంలో జ్యువెలరీ షాప్ ప్రారంభోత్సవానికి వెళ్లేందుకు హైదరాబాదు నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి మంగళవారం ఉదయం చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆయనను విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా తయారు చేయించిన మెమొంటోను నాగార్జునకు బాహుకరించారు.అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు తిరిగి అదే విమానంలో నాగార్జున హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు.



నాగార్జునకు మెమొంటో అందజేస్తున్న ఎఎస్పీ ఎ. శ్రీనివాసులు

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ మృతిచెందిన వారి కుటుంబంలో కారుణ్య నియామకాలు చేపట్టాలని మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కదిరి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారికి వినతిపత్రం సమర్పించారు .ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కదిరి మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతిచెందిన, రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పరికరాలు, పనిముట్లు, తోపుడుబండ్లు, పరకలు, మాస్కులు, గ్లౌజులు అందజేయాలన్నారు. విజయవాడ వరదల్లో పనిచేసిన కార్మికులకు రెండు జతల బట్టలు, అలవెన్స్ ఇవ్వాలన్నారు. 16 రోజుల సమ్మె కాలంలో పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ లు చెల్లించాలని. కార్మికులపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు బాలకృష్ణ, తిరుపాల్, జనార్ధన, రాజేష్, చిన్నకృష్ణ, రామంజులు, లక్ష్మన్న, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మవరం డివిజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదు

ధర్మవరం చెరువు మరువ పారుతున్న దృశ్యం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధిక వర్షపాతం నమోదయినట్లు ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8:30 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలను వెల్లడించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో కనగానపల్లి మండలంలో అత్యధికంగా 198.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. అదేవిధంగా ధర్మవరంలో 78.6, బత్తలపల్లిలో 60.4, తాడిమర్రిలో 56.4, ముదిగుబ్బలో 72.4, చెన్నె కొత్తపల్లిలో 95.4, రామగిరిలో 98.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. మొత్తం 659.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన పరిటాల శ్రీరామ్

జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షం వలన ధర్మవరం పట్టణంలోనిపలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ మంగళవారం వరద ప్రభావిత వార్డులలో పర్యటించారు. దుర్గానగర్, రాంనగర్ ప్రాంతాల్లో చేనేత మగ్గం గుంతలలోకి వర్షం నీరు చేరడంతో ఆ ప్రాంతంలో వారు పర్యటించారు. చేనేత కార్మికులకు జరిగిన నష్టాన్ని అధికారుల ద్వారా అంచనా వేయించి నష్ట పరిహారం అందే విధంగా చూస్తామని పరిటాల శ్రీరామ్ బాధితులకు హామీ ఇచ్చారు. దుర్గానగర్ లోని ఒక నివాసం ముందు విద్యుత్ స్తంభం విరిగి ఉండటం గమనించిన వారు వెంటనే స్తంభాన్ని మార్చాలని విద్యుత్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, నాయకులు ఫణి కుమార్, మాధవరెడ్డి, రాంమోహన్ రెడ్డి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణంలో వర్షపు నీరు

మడకశిర : మండల పరిధిలోని ఆర్. అనంతపురం గేట్ పాఠశాలలోకి వర్షపునీరు చేరింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 58 . 6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఆర్ అనంతపురం గేట్ ప్రాథమిక పాఠశాలలో పూర్తిగా వర్షపు నీరు నిండిపోవడంతో విద్యార్థులను ఇంటికి పంపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని బొమ్మిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన రామాంజినరెడ్డి (55) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈయన ప్రతి రోజు ఆవులు మేపుకొని జీవనం చేసేవారు. అయితే సోమవారం ఉదయం ఎప్పటిలాగే పశువులు మేతకు తీసుకెళ్లి మధ్యాహం వాటికి నీళ్ల తాపడానికి చోలెమర్రి చెరువులోకి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా రామాంజనరెడ్డికి ఫిట్స్ వచ్చాయి. దీంతో చెరువులోని చిన్న గుంతలో పడిపోయాడు. సోమవారం సాయంత్రం ఆవుల మాత్రమే ఇంటికి వెళ్ళగా అనుమానంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులో నీరు ఎక్కువ కావడంతో గుంతలో ఉన్న రామాంజనరెడ్డి మృతదేహం బయటకు తేలింది. మంగళవారం గమనించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. విషయాన్ని మంగళవారం రెవిన్యూ సిబ్బందికి తెలియజేసి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రొద్దం

మండల పరిధిలోని ఎల్‌జిబి నగర్ నుంచి ఆడుదాకులపల్లి వెళ్లే రహదారి మధ్యలో పెద్దిపల్లి ఈతవనంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గొర్రెల కాపరులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి 30 నుండి40 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

32 మేకపిల్లలు మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

పిడుగు శబ్దానికి మండలంలోని పొడరాళ్లపల్లికి చెందిన రామ్మోహన్‌కు చెందిన 32 మేకపిల్లలు మృతిచెందాయి. ఉరుములు మెరుపుల భయంకరమైన శబ్దాల ద్వారా 32 మేకపిల్లలు మృతిచెందడంతో తనకు లక్షన్నర రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కూటమి నాయకులు హిందూపురం సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమా భాయి జిల్లా పశు వైద్య అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు మేక పిల్లలకు పోస్టుమార్టం నిర్వహించారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ బాధితుడిని పరామర్శించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొడరాళ్లపల్లి సర్పంచి నాగభూషణం, ముని యాదవ్, నాగేంద్ర, వెంకటరమణ, నారాయణస్వామి, సోము, సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

మేకపిల్లలకు పోస్టుమార్టం చేస్తున్న దృశ్యం

అనారోగ్యంతో హమాలీ మృతి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని సివిల్ సప్లై బియ్యం గోడౌన్‌లో హమాలీగా పనిచేస్తున్న మండల పరిధిలోని సోమయాజులపల్లికి చెందిన ఎం రామంజులు అలియాస్ జానీ (40) సోమవారం మృతిచెందాడు. రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరుపతి సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు మృతుని కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం 20 వేల రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకి అందజేశారు. మతునికి భార్య అరుణ, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సమీపాన పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా అప్‌గ్రేడ్ సిఐ సిఐ మోహన్ వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన రికార్డుల అన్ని సక్రమంగా పెట్టుకోవాలని చెప్పారు. రోడ్డు నిబంధనలను పాటించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది గంగాధర్, షౌకత్ ఖాన్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ :మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా సిఐ నరేందర్ రెడ్డి వాహనదారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు నిబంధనలను పాటించాలని చెప్పారు.

బాల్య వివాహాలను నివారిద్దాం

ప్రజాశక్తి - రొద్దం

బాల్య వివాహాలను నివారిద్దామని అధికారులు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దకొడిపల్లి గ్రామంలో ఓ మైనర్ బాలిక కు బాల్య వివాహం చేయడానికి తల్లిదండ్రులు ఏర్పాటు చేపట్టిన విషయం ఐసిడిఎస్ అధికారులకు తెలియడంతో వారు స్పందించారు. బాలిక తల్లిదండ్రులను మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాలని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం వల్ల తలెత్తే సమస్యలను వివరించారు. అలా కాదని చేపడితే పడే శిక్షల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాతమ్మ, వైద్యాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రంలోని ధర్మవరం రోడ్డు నందు ఉన్న 384 సర్వే నెంబర్‌లోని ఇంటి స్థలాన్ని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ మంగళవారం పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 23 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు ప్రభుత్వం మారడంతో లబ్ధిదారులు పునాదులు వేస్తుండగా టిడిపి నాయకులు అడ్డుకున్నారు. అయితే పట్టాలు ఇవ్వకనే రిజిస్ట్రేషన్ వీరికి ఎలా చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో మంగళవారం ఇంటి స్థలాలను పరిశీలించి లబ్ధిదారులతో వివరాలు అడిగి తెలుసు కున్నారు. విచారణ నిర్వహించి అర్హులైన వారికి పట్టాలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులు, వీఆర్వో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలపై గ్రామసభలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని ఓబులాపురం గ్రామంలో రీసర్వే లో వచ్చిన భూ సమస్యలపై గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా 148 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ స్వర్ణలత తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీ, మండల సర్వేయర్ జోసెఫ్, రీసర్వే డిటి షణ్ముఖ, విఆర్ఒ కుళ్లాయప్ప, విలేజ్ సర్వేయర్ వేదవతి, రైతులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని గోపేపల్లిలో మంగళవారం రీసర్వే సమస్యలపై గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, విఆర్ఒ మాలిక్, మండల సర్వేయర్ అంజనదేవి తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో తేడాలొస్తే చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని చౌక ధాన్య దుకాణాలకు చెందిన త్రాసులను తూనికలు కొలతల శాఖ అధికారులు మంగళవారం పుట్టపర్తి తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. ప్రతి ఏడాది త్రాసులకు స్టాంపింగ్ వేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల వ్యాప్తంగా కలిగిన 60 చౌక ధాన్యపు దుకాణాల త్రాసులకు ముద్రలు వేశారు. ఈ సందర్భంగా తూనికల కొలత అధికారి ఎమ్‌డి గౌస్ ,మెకానిక్ నటరాజు పర్యవేక్షణలో వాటిని పరిశీలించారు.

వ్యవసాయ మహిళా కార్మిక సంఘం ఎన్నిక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని మామిళ్లకుంట క్రాస్ లో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 9 మంది కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు. కన్వీనర్‌గా రమాదేవి, కో కన్వీనర్‌గా అరుణమ్మ, రామ్మూర్తి, సాయి, సుధా తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్ మాట్లాడుతూ రాబోవు కాలంలో వ్యవసాయ ఉపాధి కూలీల సమస్యల మీద పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)
1st Floor, Trivonl Complex Ablds, Hyderabad 500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/748/2018 **15-10-2024**

Indian Overseas Bank
Versus
Cliff Packaged Drinking Water and Others

To

(CD 1) Cliff Packaged Drinking Water Rep By Its Prop. Mr. G.L. Radha Krishnan, R/o D.No.1-41A, Demakthapalli, Chilamathur Mandal, Hindupur - 515331

(CD 2) GL Radha Krishnan R/o D.No.1-41a, Demkathapalli, Chilamathur Mandal, Hindupur - 515331.

(CD 3) M Manjunath R/o D.No.1-71, Demkathapalli, Chilamathur Mandal, Hindupur - 515331.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of order, passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)in 0A/3118/2017 an amount of Rs 11141608.73 (Rupees One Crore Eleven Lakhs Forty One Thousands Six Hundred Eight And Paise Seventy Three Only) along with pendentellite and future interest at Percentage 12.50%+2%=14.50% overdue interest till realization and costs of Rs 0 (Only) has become due against you (Jointly and severally/ Fully/Limited). 2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours asset: on or before the next date of hearing.

4.You are hereby ordered to appear before the undersigned on 31/12/2024 at 10:30 a.m. for further proceedings.

5. In addition to the sum aforesaid, you will also be liable to pay: (a) Such Interests as Is payable for the period commencing immediately after this notice of the certificate/execution proceedings. (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 15/10/2024

Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2)

ఎస్ఎఫ్ఐ పోరాటాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న బాబావలి

విద్యార్థి ఉద్యమంలో ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తు విద్యార్థి ఉద్యమంలో ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం నిర్వహిస్తోందని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి అన్నారు. మంగళవారం పట్టణంలోని నారాయణ కళాశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు తీసుకొస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి ఎస్ఎఫ్ఐలో సభ్యత్వం తీసుకుని విద్యార్థి ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, నందీష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి - మడకశిర

గత వైసిపి ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపు చర్యల్లో నష్టపోయిన బాధితుడిని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చేయూత ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని రొళ్ళ మండలం ఎం.రాయాపురం పంచాయతీ హునిసేకుంట గ్రామానికి చెందిన రామచంద్రప్ప చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం చేసేవాడు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నాయకులు రామచంద్రప్పపై కక్ష పెంచుకుని అతడిని బెదిరించి దుకాణాన్ని కూల్చివేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం హునిసేకుంట గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి రామచంద్రప్ప సమస్యను స్థానిక నాయకులు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బాధితుడు దుకాణం ప్రారంభించడానికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు రామచంద్రప్ప మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ప్రత్యేక చొరవ తీసుకొని తనకు ఆర్థిక సహాయం అందించి దుకాణం తెరిపించారన్నారు. ఈసందర్భంగా బాధితుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుంచితి వక్కలిగా రాష్ట్ర కన్వీనర్ విఎం. పాండురంగప్ప, కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి, జీకే ఈరన్న, సిద్ధ గంగప్ప, రామకృష్ణ, నారాయణప్ప, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కాలువల మరమ్మతుపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-హిందూపురం

నీటిపారుదల శాఖ ఆధీనంలో ఉన్న కాలువల పైన ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, వెంటనే గండిపడిన కాలువను మరమ్మతు చేయించాలని నీటిపారుదల శాఖ డిఇ యోగానందకు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు సూచించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పెన్నా కుమద్వతి ప్రాజెక్టుకు నీరు చేరాయి. ఆ నీటిని నీటి పారుదల శాఖ కాలువ ద్వారా కొట్నూరు చెరువుకు మళ్లించారు. అయితే ఈ కాలువకు అహ్మద్ నగర్ వద్ద గండిపడటంతో అహ్మద్ నగర్ ప్రాంతంలోకి నీరు చేరాయి.. ఈ విషయాన్ని స్థానికులు మంగళవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నీటిపారుదల శాఖ అధికారులు అక్కడికి పిలిపించుకుని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు

అమ్యూనిటీ సెక్రటరీల తీరుపై కమిషనర్ ఆగ్రహం :

పురపాలక సంఘ వ్యాప్తంగా రెండు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరాయి. ఈసందర్భంగా కమిషనర్ మంగళవారం ద్విచక్ర వాహనంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడ ఆయా సచివాలయాలకు సంబంధించిన అమ్యూనిటీ సెక్రటరీలు కనీస చర్యలు సైతం చేపట్టకపోవడాన్ని గమనించారు. దీంతో తన ఛాంబర్‌లో అమ్యూనిటీ సెక్రటరీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల వారిగా సమీక్షలు నిర్వహించి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు అమ్యూనిటీ సెక్రటరీలకు మెమోలు జారీ చేయాలని ఆయా విభాగాల డీఈలను ఆదేశించారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో డిడబ్ల్యుఎంఎ, డిఆర్‌డిఎ, జిల్లా పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, స్కిల్ డెవలప్మెంట్, గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ ఆంధ్ర 2047, వంద రోజుల్లో చేపట్టే పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయడంతో పాటు పనిదినాలు జనరేట్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో చేపట్టిన పనులను వంద శాతం పూర్తి చేయాలన్నారు. వికసిత్ ఆంధ్ర – 2047 యాక్షన్ ప్లాన్ అనుగుణంగా పనులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులకు క్లోరినేషన్ పనులు ఈనెల 24 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల మరమ్మతు పనులు పూర్తిచేసి వినియోగంలో తీసుకురావాలన్నారు. ఎస్ డబ్ల్యు పిసి నిర్మాణాలను డివిజన్ , మండలాల వారీగా నివేదికలు అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఆగస్టు నెలలో మడకశిరలోని గుండుమల గ్రామంలో నిర్వహించిన ప్రజా వేదిక సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యక్రమాన్ని వేగవంతంచేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్‌ను ఆదేశించారు. తదుపరి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని చెప్పారు. డిఆర్‌డిఎఉన్నతి పురోగతి నివేదికను నవీకరించి లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. ఆర్డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో చేపట్టే పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ఒక వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల వారి శాఖ, స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అందుకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు సంబంధించిన అర్హుల జాబితా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిడబ్ల్యుఎంఎ పీడీ విజయేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మల్లికార్జునప్ప, పంచాయతీ రాజ్ ఎస్ఇ మురళీకృష్ణ, డిపిఒ సమత, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అగళిలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - అగళి

మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు బుధవారం అగళి మండలంలో పర్యటించనున్నట్లు టిడిపి స్థానిక నాయకులు తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి గుండుమల తిప్పేస్వామి కూడా పర్యటించనున్నారని చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు వారు భూమిపూజ చేయనున్నారని టిడిపి మండల కన్వీనర్ కుమారస్వామి తెలిపారు.

నేడు పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ మీట్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి హాజరవుతారన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బలిజ సంరక్షణ సమితి కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని బలిజ సామాజికవర్గం ఆధ్వర్యంలో నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు, అధ్యక్షులుగా కావేటి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా పెనుగోలు నరేష్ బాబు, కార్యదర్శిగా హరికుమార్, సహాయ కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా నారాయణస్వామి, గౌరవ అధ్యక్షులుగా దేగల వెంకట, గౌరవ ఉపాధ్యక్షులుగా గుర్రం కరుణాకర్, గౌరవ సలహాదారులుగా బొగ్గు రాజశేఖర్, దేగల కిషోర్, గుర్రం జయచంద్ర, కోణా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మల్లేపల్లి కిషోర్, హరి, రామస్వామి, మల్లికార్జున, పసుపులేటి గుణశేఖర్, జిటి జయశంకర్, రెడ్డప్ప కులదీప్, బత్తిన అశోక్‌ను ఎన్నుకున్నారు.

సభ్యత్వ నమోదుపై శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ సభ్యత నమోదు పై శిక్షణా తరగతులు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ క్రియాశీలక సభ్యులు, సానుభూతిపరులు తప్పనిసరిగా సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. ఈ నెల 26వ తేదీ నుండి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, నాయకులు అశ్వర్థరెడ్డి, భాస్కర్, ప్రెస్ వెంకటేష్, రాజశేఖర్, రామాంజినమ్మ, పరిమళ, శివకుమార్, వెంకటరమణ, కింగ్స్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ నాయకులకు సన్మానం

ప్రజాశక్తి - మడకశిర

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జాతీయ నాయకులు స్రామ్రాట్ కెబి. మధుకు గౌరవ డాక్టర్ పట్టా వచ్చిన సందర్భంగా టిడిపి నాయకులు మంగళవారం ఆయనను సన్మానించారు. టిడిపి అధికార ప్రతినిధి మోద శివ, ఎమ్మార్పీఎస్, ఎంఇఎఫ్ సీనియర్ నాయకులు ఆంజనేయులు, ఎంఇఎఫ్ రామకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులు ఆనంద్ తదితరులు మధును ఈసందర్భంగా సత్కరించారు . ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు అమర్ నాథ్ , అనంతపురం జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు హరి గోపాల్, హిందూపురం ఎంఇఎఫ్ నాయకులు శంకరయ్య, హిందూపురం నగర అధ్యక్షులు నరసింహులు, సత్య సాయి జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్ఎన్. నరసింహులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చంద్రకచర్ల గంగాధర్, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయ కార్యదర్శులు సమయపాలన పాటించి ప్రభుత్వ నిర్దేశాలను అమలు చేయాలని ఎంపీడీవో సరస్వతి సూచించారు. మంగళవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని కగ్గల్లు సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రతి కార్యదర్శి నిర్దేశిత సమయంలోపు హాజరు వేయాలన్నారు. అదే విధంగా సచివాలయ పరిధిలో అమలవుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పరిధిలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లను గుర్తించాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలో మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న లేఅవుట్లను త్వరితగతిన గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన ఛాంబర్‌లో లైసెన్సుడ్ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హిందూపురం పట్టణంలో చాలామంది మున్సిపాలిటీ నుండి ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. వాటిని గుర్తించాలన్నారు. అందుకు అనుగుణంగా అక్రమ లేవుట్లు అనుమతి పొందాలంటే ఎలాంటి నిబంధన పాటించాలన్న విధివిధానాలను రూపొందించాలని తెలిపారు. అందుకు అనుగుణంగా నివేదికలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న షార్ట్ ఫాల్ మొత్తాలను భవన యజమానుల నుండి నవంబర్ 15వ తేదీ లోపు వసూలు చేయాలని చెప్పారు.

గర్భిణులకు భోజన సౌకర్యం

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలుగుదేశం యువ నాయకులు కత్తి మారుతి ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు హరీష్, ఓంకార్, సూపర్వైజర్లు రత్నమ్మ, రవీంద్ర, సిహెచ్ఒ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహించిన దూప్లేట్ వాగు

ప్రజాశక్తి - బత్తలపల్లి

భారీ వర్షాలతో న్యామద్దెల, కుంటిమద్ది, గంతిమర్రి చెరువులు నిండి మరువపారడంతో ఆ ప్రవాహం బత్తలపల్లి మండలం పోట్లమర్రి సమీపాన గల దూప్లేటు వాగు ఉధతంగా ప్రవహించింది. ఈ నీరంతా మండలంలోనే అతి పెద్ద చెరువైన అప్పరాచెరువుకు వెళుతోంది. బత్తలపల్లి మండలంలో 60.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గొట్లూరు వాగు, పోట్లమర్రి వద్ద దూప్లేట్ వాగు రహదారి పైన ఉధతంగా ప్రవహిస్తుండడంతో ధర్మవరం–బత్తలపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. గొట్లూరు, ధర్మవరం చెరువులు నిండి మరువపారడంతో రెండు చెరువుల నీరు చిత్రావతి నదికి చేరుతోంది. మండలంలోని రామాపురం సమీపానగల చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దఎత్తున చిత్రావతి నది ప్రవహిస్తుండడంతో చిత్రావతి డ్యాంలోని పెద్దపెద్ద చేపలు నీటి ప్రవాహానికి ఎగబాకుతున్నాయి. చిత్రావతి పరివాహక గ్రామాల ప్రజలు చేపలు పట్టుకోవడానికి, నీటి ప్రవాహాన్ని తిలకించడానికి భారీగా తరలివచ్చారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా పోట్లమర్రి దూప్లేట్ వాగు వద్ద, సంగమేశ్వర క్షేత్రం వద్ద, చిత్రావతి నది వద్ద పోలీస్ సిబ్బందిని నియమించారు.

ధర్మవరం- బత్తలపల్లి రాకపోకలు బంద్

నీటితో కుషావతి, చిత్రవతి కళకళ

చిలమత్తూరు : సోమవారం రాత్రి కర్నాటకలో కురిసిన వర్షాలకు గుడిబండ చెరువుతో పాటు హంపసంద్ర డ్యాం పొంగిపొర్లింది. ఈ ప్రవాహంతో కుషావతి నది ప్రవాహం అంతకంతకు పెరిగింది. పరగోడ డ్యాం నిండటంతో చిత్రవతి నది ప్రవాహం కూడా పుంజుకుంది. చిలమత్తూరు మండలంలో ప్రవహించే చిత్రవతి, కుషావతి నదులు నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. కుషావతి నది ప్రవహించడంతో దాని మీదుగా రాకపోకలు సాగించే కోడూరు పంచాయతీ గ్రామాల విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ప్రవాహం పెరిగితే విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బంది అవుతుందని అధికారులు పాఠశాలకు సెలవు ఇచ్చారు. విద్యార్థులను అధికారులు, పోలీసులు దగ్గరుండి నదిని దాటించారు. వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ యూనస్ బాబు సూచించారు.

బత్తలపల్లి, ధర్మవరం రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

విద్యార్థులను వరద కాలువ దాటిస్తున్న అధికారులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రొల్ల మండలంలో మల్లిన మడుగు పంచాయతీలో మంగళవారం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ వారోత్సవాలలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి మల్లినమడుగు, చిట్టి హళ్లి గ్రామాల్లో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుంచిటి వక్కలిగా రాష్ట్ర కన్వీనర్ వివిఎం. పాండురంగప్ప, ఎంపీడీవో ప్రసాద్, ఎపిడి లక్ష్మీనారాయణ, కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బి ఎస్ గురుమూర్తి, జెకె ఈరన్న, భరత్, జి ఎస్ యోగానంద్, మాజీ ఎంపీపీ క్రిష్టప్ప, ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -కొత్త చెరువు

కొత్తచెరువు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన ఎద్దుల బండ పోటీల్లో విజేతలకు స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పోటీ నిర్వాహకులు వాల్మీకి భాస్కర్‌ను ఆ సంఘం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు భాస్కర్ తో పాటు మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ సాలక్క గారి శ్రీనివాసులు, మండల పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకులు భాను ప్రకాష్, రాజా, శ్రీనివాసులు, నాగేంద్ర, బండి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

మండలంలోని వెలిచెలమల గ్రామంలో పోమేనాయక్ సాగు చేసిన వేరుశనగ పంటను అధికారులు మంగళవారం పరిశీలించారు. యాజమాన్య పద్ధతులతో సాగు చేసిన పంటను డాక్టర్ యస్.రవి సందర్శించారు. రైతు ఉత్పత్తి కంపెనీ వారితో ఒప్పందం చేసుకున్న ఐదుగురు రైతుల వేరుశెనగ కాయల నమూనాలను వారి పొలాలకు వెళ్లి పరిశీలించారు.